సాక్షి
రంగారెడ్డి
శనివారం ౹ 11 ౹ మే ౹ 2024



లాభాలు బాగు

ప్రతికూల వాతావరణంలోనూ షేడ్‌నెట్, పాలిహౌస్ పద్ధతులతో మంచి ఫలితాలు వస్తాయి.

2లో▸



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి తదితరులను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

న్యూస్‌రీల్

మోదీతోనే అభివృద్ధి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

మహేశ్వరం: దేశ ప్రధానిగా నరేంద్రమోదీ పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మన్సాన్‌పల్లి చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీకి ఓటేస్తే రిజర్వేషన్లు మారుస్తారని దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తే ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా చేతులెత్తేశారని విమర్శించారు. బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే బురదలో వేసినట్లే అన్నారు. దేశ వ్యాప్తంగా జరిగే ఎన్నికల్లో 400 ఎంపీ సీట్లు, తెలంగాణలో 12 గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఓడిపోతామనే భయంతోనే రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడారి జంగయ్య యాదవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టి.యాదిష్, పార్టీ మండల అధ్యక్షుడు మాధవచారి తదితరులు పాల్గొన్నారు.

387 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సైబరాబాద్ పరిధిలో మొత్తం 3,209 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, వీటిలో 387 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలను జియో ట్యాగ్ చేయడంతో పాటు 1,218 స్థానాలలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఎన్నికల బందోబస్తు, ఇతరత్రా అంశాలపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 13 కంపెనీలకు చెందిన కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్)లను పోలింగ్ కేంద్రాలలో మోహరిస్తారు. 6 వేల మంది రాష్ట్ర పోలీసు సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. 867 మంది సాయుధ పోలీసు బలగాలు ఎన్నికల మార్గాల్లో, పోలింగ్ రోజు ఆయా ప్రాంతాలలో గస్తీ కాస్తారు. లోక్‌సభ ఎన్నికల తనిఖీల నేపథ్యంలో రూ.10.54 కోట్ల నగదు, 17,468 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 794 కేసులు నమోదు చేశారు 1,091 నాన్ బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూ)లను జారీ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) నిబంధనలు ఉల్లంఘించిన 20 మందిపై కేసులు నమోదు చేశారు.

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేపై కేసు

రహమత్‌నగర్: ప్రార్థన మందిరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారంటూ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, బీఆర్‌ఎస్ నాయకులపై బోరబండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే ఎస్‌ఆర్‌ఆర్‌పురం సైట్1 కమాన్ వద్ద ఉన్న చిల్లాలో పార్టీ కండువాలతో ప్రార్థనలు నిర్వహించారు. దీనిని సుమోటోగా తీసుకున్న ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్‌టీ) ఎమ్మెల్యే, అతడి అనుచరులపై కేసు నమోదు చేసింది.



మిగిలింది కొన్ని గంటలే..

నేటితో ప్రచారానికి తెర

- చివరిరోజు హోరెత్తించనున్న అభ్యర్థులు
- నియోజకవర్గం మొత్తం చుట్టివచ్చేలా ప్రణాళికలు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు యత్నాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడనుంది. చివరి రోజైన శనివారం అభ్యర్థులు హోరెత్తించనున్నారు. సాధ్యమైనంత ఎక్కువ మంది ఓటర్లను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం రోజంతా రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జాతీయ ముఖ్యనేతలే కాదు.. బరిలో ఉన్న అభ్యర్థులు, వారి బంధువులు, పార్టీ శ్రేణులు బృందాలుగా విడిపోయి లోక్‌సభ నియోజకవర్గం మొత్తాన్ని చుట్టేయనున్నారు. సాయంత్రం ఆరు గంటల లోపు అన్ని ప్రాంతాలను కవర్ చేసేందుకు వీలుగా ప్లాన్ చేస్తున్నారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా సహా బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్య మంత్రులు, ఇతర ముఖ్య నేతలు ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో రోడ్‌షోలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సరూర్‌నగర్ వేదికగా ప్రచారం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రోజుకో అసెంబ్లీ నియోజకవర్గంలో రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తూ..అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్ల నుంచి బస్సు యాత్ర చేపట్టారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆయా అగ్రనేతలంతా విస్తృత ప్రచారం చేశారు. పోలింగ్‌కు 48 గంటలు మాత్రమే మిగిలి ఉండటంతో ఆఖరి ప్రయత్నంలో నిమగ్నమయ్యారు.

పంపకాలతో ఓటర్లకు ఎర

ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలనే భావనతో అభ్యర్థులు పోలింగ్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలోని కార్యకర్తలు, ముఖ్య నేతల ద్వారా ఓటర్లను ప్రసన్నం చేసేందుకు యత్నిస్తున్నారు. సామాజిక వర్గం.. కాలనీ సంక్షేమ సంఘాలు.. ఉద్యోగ, కార్మిక సంఘాలు.. గేటెడ్ కమ్యూనిటీలు, మారుమూల గ్రామాలు, బస్తీల వారీగా అన్ని మార్గాల్లో వారిని ఆకట్టుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఉపాధి అవకాశాల పేరుతో ఇతర ప్రాంతాలకు వలసవెళ్లిన వారిని తిరిగి రప్పించే ఏర్పాట్లు కూడా చేశారు. రాను, పోను బస్సు చార్జీలు సైతం చెల్లిస్తున్నారు. ఓటింగ్‌శాతం పెంపు కోసం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు.

అప్రమత్తమైన ఎన్నికల కమిషన్

ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే అభ్యర్థులు, ఆయా పార్టీల ముఖ్య నాయకులపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా పెట్టింది. స్థానికేతరులంతా ప్రచారం ముగియగానే లోక్‌సభ నియోజకవర్గాన్ని వీడి వెళ్లిపోవాల్సిందిగా ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఫంక్షన్‌హాళ్లు, హోటళ్లు, లాడ్జీల్లో తనిఖీలు ముమ్మరం చేసింది. అనుమానాస్పద వ్యక్తులు కన్పిస్తే అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. వివాదాస్పద పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. శనివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు నగదు, మద్యం పంపిణీ ఎక్కువగా జరిగే అవకాశం ఉండటంతో ఆ దిశగా నిఘా ఏర్పాటు చేసింది. సి-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందిస్తోంది. అంతేకాదు జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దుల్లో వచ్చి వెళ్లే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే రూ.42 కోట్లకు పైగా పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. వచ్చే 48 గంటల్లో ఈ తరహా కేసులు మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. మరికొద్ది గంటల్లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ఎన్నికలక కమిషన్ సర్వం సిద్ధం చేసింది. ఈవీఎం, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ల పనితీరును పలుమార్లు పరిశీలించింది. 23 వేల మంది సిబ్బందిని ఎంపిక చేసి, ఇప్పటికే వారికి శిక్షణ కూడా ఇచ్చింది. ఆదివారం ఉదయం వారంతా ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరుకుని, పోలింగ్ సామగ్రిని తీసుకుని, కేటాయించిన పోలింగ్ కేంద్రానికి వెళ్లనున్నారు.

నీరా‘జనం’

- షాద్‌నగర్‌లో ముఖ్యమంత్రి రోడ్‌షో సక్సెస్
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు, జనం
- షాద్‌నగర్ అభివృద్ధికి రేవంత్‌రెడ్డి వరాలు
- ఆద్యంతం ఉత్సాహం నింపిన ప్రసంగం

షాద్‌నగర్/ షాద్‌నగర్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా షాద్‌నగర్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో విజయవంతమైంది. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి షాద్‌నగర్‌కు విచ్చేసిన రేవంత్‌రెడ్డికి జనం నీరాజనం పలికారు. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ నుంచి నేరుగా ఆయన సాయంత్రం 6గంటలకు హెలికాప్టర్ ద్వారా షాద్‌నగర్ పట్టణానికి చేరుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, తాండ్ర విశాల, వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర కాశీనాథ్‌రెడ్డి, యాదయ్య యాదవ్ తదితరులు ఘన స్వాగతం పలికారు.

జన హోరు.. నినాదాల జోరు

హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రత్యేక వాహనంలో బైపాస్ మీదుగా పట్టణంలోని కేశంపేట రోడ్డుకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్ షో ముఖ్య కూడలికి చేరుకుంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పార్టీ శ్రేణులు, జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. సీఎంకు అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఆ రెండు పార్టీలపై విమర్శనాస్త్రాలు

రోడ్‌షోలో రేవంత్‌రెడ్డి అరగంటకుపైగా మాట్లాడారు. ఈ ప్రసంగం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. బీజేపీ, బీఆర్‌ఎస్‌లపై ఆయన సంధించిన విమర్శనాస్త్రాలు జనం ఆసక్తిగా విన్నారు.

షాద్‌నగర్ రూపురేఖలు మారుస్తా..

షాద్‌నగర్‌ను నగరంగా మారుస్తానని.. రేపురేఖలు మారుస్తానని.. రైల్వే ఓవర్ బ్రిడ్జితో పాటు శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వరకు మెట్రోలైన్ విస్తరణ, డ్రైనేజీ నిర్మాణ పనులు, మున్సిపాలిటీకి రూ.30 కోట్లు కేటాయిస్తానని సీఎం వరాలు కురిపించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పాలమూరు ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేవలం వంద రోజుల్లోనే అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని కొనియాడారు. పదేళ్లు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజల అభివృద్ధికి చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పార్టీలో చేరికలు

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ సీనియర్ నేత భీష్వ కిష్టయ్య, మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాష్‌గౌడ్, సాయికృష్ణ తదితరులు సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పోలీసుల భారీ బందోబస్తు

డీసీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా దారి మళ్లించారు.



రోడ్‌షోకు తరలివచ్చిన పార్టీశ్రేణులు, జనం

అయ్యో శివశౌర్య

- సమ్మర్ క్యాంపులో అపశ్రుతి
- స్విమ్మింగ్ పూల్‌లో మునిగి చిన్నారి మృతి
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు
- పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ



శివశౌర్య (ఫైల్)

మొయినాబాద్: వేసవి సెలవుల్లో సరదాగా గడుపుదామని.. ఆటలో మెలకువలు నేర్చుకుందామని వెళ్లిన చిన్నారి విగతజీవిగా మారాడు. స్విమ్మింగ్ పూల్‌లో మునిగి ఒకటో తరగతి చిన్నారి మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన మొయినాబాద్ మండలం సుజాత స్కూల్‌లో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సురంగల్‌కు చెందిన గాండ్ల విక్రమ్ చిన్న కుమారుడు గాండ్ల శివశౌర్య (7) నాగిరెడ్డిగూడ రెవెన్యూ పరిధిలోని సుజాత స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో స్కూల్‌లో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు క్రికెట్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, యోగాతో పాటు స్విమ్మింగ్ క్లాసులు నిర్వహిస్తున్నారు. విక్రమ్ తన కుమారుడు శివశౌర్యను బ్యాడ్మింటన్ నేర్పించేందుకు క్యాంపులో చేర్పించాడు. శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో శివశౌర్య స్విమ్మింగ్ చేస్తూ నీటిలో మునిగాడు. సిబ్బంది గమనించి విద్యార్థిని బయటకు తీశారు. నీళ్లు మింగి అపస్మారకస్థితిలో ఉండటంతో వెంటనే స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే..

పిల్లలకు, పెద్దలకు వేర్వేరుగా స్విమ్మింగ్ పూల్స్ ఉన్నాయి. నాలుగు రోజులుగా పిల్లల స్విమ్మింగ్ పూల్ రిపేర్‌లో ఉంది. దీంతో పెద్దల స్విమ్మింగ్ పూల్‌లోనే పిల్లలను స్విమ్మింగ్ చేయిస్తున్నారు. పిల్లలకు సేఫ్టీ బెలూన్స్ లేవని.. అవి తేవాలని కోచర్లు యాజమాన్యానికి సూచించినా వారు పట్టించుకోలేదని తెలిసింది.

గుండెలు బాదుకున్న తల్లిదండ్రులు

సమ్మర్ క్యాంపులో భాగంగా బ్యాడ్మింటన్ శిక్షణకు పంపామని.. స్విమ్మింగ్ చేయిస్తున్నట్లు తమకు తెలియదని చిన్నారి తండ్రి విక్రమ్ రోదించారు. తమ కుమారుడి మరణానికి పాఠశాల యాజమాన్యమే కారణమని వాపోయారు. కొడుకు మృతితో తల్లిదండ్రులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు.

ఆదర్శ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదర్శ కళాశాలలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని బొంగ్లూర్ ప్రిన్సిపాల్ లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి గాను పదో తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి రుసుములేదని, ఈనెల 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందన్నారు. హాస్టల్ వసతి ఉందని, పుస్తకాలు, యునిఫాం ఉచితంగా అందజేస్తామన్నారు.

చేసిన సేవలే గుర్తింపు

రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ సాధిస్తా..

- నాకు పోటీ ఎవరూ లేరు
- అన్ని ప్రాంతాల్లోనూ బ్రహ్మరథం
- నేను చేసిన పోరాటాన్ని బీసీలు మరిచిపోలేదు
- చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో నేను చేసిన సేవలే నా ప్రచారాస్త్రాలు. చేవెళ్ల ఎంపీ ఎన్నికల్లో నాకు పోటీ ఎవరూ లేరు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు తండాల వాసులు కూడా నాకు బ్రహ్మరథం పడుతున్నారు. కాంగ్రెస్ ,బీజేపీ అభ్యర్థులు ఎన్ని జిమ్మిక్కులు చేసిన చేవెళ్ల ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా అందించిన సేవలు ప్రజలకు ఇంకా గుర్తున్నాయి. 93 బీసీ కులాల ఐక్య వేదిక ఏర్పాతో బీసీ హక్కుల సాధనకు చేసిన పోరాటం ప్రజలు మర్చిపోలేదు. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామని ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. మతతత్వ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, జాతీయ స్థాయి ప్రాజక్టుల సాధనకు ప్రజలతో కలిసి పోరాటం చేస్తా.. అని చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయావకాశాలపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఇంటర్వ్యూ విశేషాలు ఆయన మాటల్లోనే..

ప్రశ్న: ప్రస్తుత ఎన్నికల్లో మీ విజయానికి కలిసి వచ్చే అంశాలు ఏమిటి?

జవాబు: చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో 16 లక్షల బీసీ ఓటర్లు ఉన్నారు. బీసీ బిడ్డగా వారు నన్ను ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, సబ్బండ వర్గాల ప్రజలు నాకు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారు. నేను రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ సాధించడం ఖాయం.

ప్రశ్న: కాంగ్రెస్, బీజేపీ నుంచి ఇద్దరు బలమైన ప్రత్యర్థులు ఉన్నారు. వారిని ఎలా ఎదుర్కొంటారు.?

జవాబు: చేవెళ్లలో నాకు ఎవరూ పోటీ కాదు. ఎన్నికలు ఏకపక్షమే. సబ్బండ వర్గాలు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులెవరో చేవెళ్ల ప్రజలకు తెలిసిపోయింది. వారు ఎన్ని మాటలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు.

ప్రశ్న: నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు ఏమిటి?

జవాబు: చేవెళ్ల, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో 111 జీవో సమస్య, వికారాబాద్ జిల్లాలో నూతన రైల్వే లైన్ ఏర్పాటు, తాండురులో కందిబోర్డు ఏర్పాటు, కోట్‌పల్లి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడంతో పాటు అనంతగిరిని సైతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. పర్యావరణ ముప్పునకు కారణమైన రాడర్ స్టేషన్‌ను రద్దు చేయించేందుకు పోరాటం చేస్తా.



ప్రశ్న: వికారాబాద్, కృష్ణ రైల్వేలైన్ మాటేమిటి?

జవాబు: వికారాబాద్, పరిగి, దోమ, కోస్గి, నారాయణపేట్ మీదుగా మొదటి రైల్వేలైన్ సర్వే జరిగింది. వికారాబాద్ ,పరిగి, బోరాంస్‌పేట్, కోడంగల్, హుస్నాబాద్, కోస్గి, నారాయణ్‌పేట్ మీదుగా కృష్ణ వరకు రెండోసారి సర్వే నిర్వహించారు. అయినా ఇప్పటికీ నూతన రైల్వే లైన్ సాధనకు ఎవరూ చిత్తశుద్ధితో కృషి చేయలేదు. నేను ఎన్నికైన వెంటనే రైల్వే లైన్ సాధించి చూపిస్తా.

ప్రశ్న: వికారాబాద్ జిల్లా ప్రజలకు ఎంఎంటీఎస్ కలగానే మిగిలిపోయింది. దీనికి మీ సమాధానం?

జవాబు: విశ్వనగరానికి దగ్గరగా ఉన్న వికారాబాద్‌కు ఎంఎంటీఎస్ సేవలు తప్పకుండా తీసుకొస్తా. ఇక్కడి నుంచి నిత్యం వేలాది మంది హైదరాబాద్‌కు ఉద్యోగాలు, పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతానికి ఎంఎంటీఎస్ తీసుకురావడం నా బాధ్యత. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎంఎంటీఎస్ సాధిస్తా.

ప్రశ్న: బీసీలు మీకు అండగా ఉన్నారని నమ్ముతున్నారా?

జవాబు: నాకు పూర్తి స్థాయిలో విశ్వాసం ఉంది. బీసీలందరూ పార్టీలకు అతీతంగా నాకు ఓటు వేయబోతున్నారు. బీసీల సత్తా ఏంటో చేవెళ్ల ప్రజలు మే 13న నిరుపించనున్నారు.

ప్రశ్న: ముదిరాజ్‌ల మద్దతు ఎలా ఉంటుంది.?

జవాబు: నా రాజకీయ జీవితం ప్రారంభమైనప్పటి నుంచి ముధిరాజ్‌ల హక్కులు, వారి ఆత్మ గౌరవం కోసం చేయని పోరాటం లేదు. ముదిరాజ్‌లు ఏ పార్టీల్లో ఉన్నా నన్ను గుండెల్లో పెట్టుకుంటారు. ఈ ఎన్నికల్లో ముదిరాజ్‌ల ఐక్యతను చాటబోతున్నారు.





'నమో' రాగం

ఎల్బీ స్టేడియంలో బీజేపీ జనసభ జోష్

ఎల్బీ స్టేడియం బీజేపీ శ్రేణులతో మెరిసింది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థులు మాధవీలత, కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలను గెలిపించాలంటూ శుక్రవారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన జనసభలో నమో నినాదం మార్మోగింది. ప్రధాని మోదీ నామ స్మరణతో దిక్కులు పిక్కటిల్లాయి. మోదీ చిత్రాలతో కూడిన ప్లకార్డులను పట్టుకొని బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నాయి. బేగంపేట విమానాశ్రయం నుంచి షాపర్స్ స్టాప్, హెచ్‌పీఎస్, బేగంపేట ఫ్లైఓవర్, గ్రీన్‌ల్యాండ్స్, యశోదా ఆస్పత్రి నుంచి ఎల్బీ స్టేడియం వరకూ దారి పొడవునా కాషాయ జెండాలు రెపరెపలాడాయి. – సాక్షి, సిటీబ్యూరో


పట్టుబడిన టిప్పర్లు, ట్రాక్టర్

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్

ఆమనగల్లు: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ సమీపంలోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు వద్ద హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై తనిఖీ చేస్తుండగా కల్వకుర్తి వైపు నుంచి రెండు టిప్పర్లు మట్టిని నింపుకొని వస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వెల్దండ మండలంలోని వివిధ చెరువులలో అక్రమంగా మట్టిని తరలించడంతో రెండు టిప్పర్లను సీజ్ చేశారు. దీనిపై టిప్పర్ యజమాని దేవేందర్, డ్రైవర్లు సేనావత్ చందర్, ఆకుల కృష్ణలపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. అలాగే ఆమనగల్లు మండలం శంకరకొండతండా వాగు నుంచి ఆమనగల్లుకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని డ్రైవర్ సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీఐ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి, ఇసుక తవ్వి రవాణా చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

షేడ్‌నెట్ సాగు.. లాభాలు బాగు

కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రతికూల వాతావరణంలోనూ షేడ్ నెట్, పాలిహౌజ్ పద్ధతులతో మంచి ఫలితాలు వస్తాయి. వీటిని 'కేతి' అనే స్వచ్ఛంద సంస్థ రాయితీపై రైతులకు అందిస్తోంది.

- రైతులకు ప్రోత్సాహం అందిస్తున్న కేతి సంస్థ
- నాణ్యమైన కూరగాయలకు మార్కెట్‌లో డిమాండ్

కొందుర్గు: ప్రస్తుత ఎండల తీవ్రతకు కూరగాయల సాగు ప్రశ్నార్థకంగా మారింది. అప్పులు చేసి కూరగాయల పంటలు సాగుచేస్తే ఎండలకు తట్టుకోక పూత, కాత రాలిపోయి ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం లేదు. వీటిని అధిగమించడానికి రైతులు స్టేకింగ్ చేయడం, డ్రిప్ ద్వారా నీళ్ల అందించడం, కలుపు మొక్కలు రాకుండా ఉండేందుకు మల్చింగ్ పద్ధతి పాటించడం వంటి మెళకువలు తీసుకుంటున్నారు. అదేవిధంగా ఎండ తీవ్రతను తట్టుకోవడానికి షేడ్ నెట్ వేయడం, పాలిహౌజ్ వంటి పద్ధతులు పాటిస్తున్నారు.

రూ.55 వేలు చెల్లిస్తే చాలు

చిన్న రైతులకు 'కేతి' అనే ఎన్‌జీఓ ప్రోత్సాహం అందిస్తుంది. ఒక కుటుంబానికి 4 గుంటల విస్తీర్ణంలో రాయితీతో షేడ్ నెట్ ఏర్పాటు చేస్తుంది. సాధారణంగా 4 గుంటల విస్తీర్ణంలో ఈ నెట్ ఏర్పాటు చేయడానికి దాదాపు ఒక లక్ష రూపాయల పైనే ఖర్చు వస్తుంది. రైతు రూ.55,400 చెల్లిస్తే మిగతా డబ్బులు కేతి సంస్థ వెచ్చించి షేడ్ నెట్ నిర్మాణం చేసి అప్పగిస్తుంది. సాగులోనూ సలహాలు, సూచనలు అందిస్తుంది. ఈ షేడ్ నెట్‌లో టమాట, వంకాయ, కాలిఫ్లవర్, ఫ్రెంచ్ బీన్స్, క్యాప్సికమ్, పచ్చి మిర్చి పంటలను సాగు చేయవచ్చని కేతి సంస్థ ప్రతినిదులు చెబుతున్నారు. సాధారణంగా అర ఎకరం పొలంలో సాగుచేస్తే వచ్చే దిగుబడి, షేడ్ నెట్‌లో 4 గుంటల విస్తీర్ణంలో సాగుచేస్తే వచ్చే దిగుబడితో సమానం. ఇందులో సాగుచేసిన కూరగాయలకు మార్కెట్లో అధిక ధర పలుకుతుంది. తమ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో 500 మందికి పైనే రైతులను ఎంపిక చేసి షేడ్ నెట్‌లలో కూరగాయలు సాగుచేయిస్తున్నామని సంస్థ ప్రతినిధి ప్రసాద్ పేర్కొన్నారు.


కొందుర్గు: ముట్పూర్‌లో సాగుచేసిన కీర పంట


చెట్టునిండా కాసిన టమాట

నాణ్యమైన పంట

షేడ్ నెట్, పాలిహౌజ్‌లలో సాగుచేసే కూరగాయలు, పువ్వుల తోటలకు చీడపీడల బెడద తక్కువగా ఉండటంతో ఎలాంటి మచ్చలు, పుచ్చులు లేకుండా నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి. ఇందులో పండించిన కూరగాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో అధిక లాభాలు వస్తున్నాయిని రైతన్నలు అంటున్నారు. అయితే షేడ్ నెట్‌లు, పాలిహౌజ్‌లు ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో చిన్న సన్నకారు రైతులు పాత పద్ధతిలో కూరగాయలు సాగు చేస్తూ అప్పుల పాలవుతున్నారు.

ప్రభుత్వం రాయితీ ఇవ్వాలి



16 గుంటల విస్తీర్ణంలో మొదటి పంటగా కీరాను సాగుచేస్తే 18 టన్నుల దిగుబడి వచ్చింది. రెండో పంటగా టమాట వేస్తే 15 టన్నుల దిగుబడి లభించింది. కేతి సంస్థ వారు కేవలం చిన్న రైతులకు షేడ్ నెట్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం సైతం రాయితీ కల్పించాలి. – అంజి రెడ్డి, రైతు, ఉత్తరాసిపల్లి

సబ్సిడీ ఇవ్వడం లేదు



ఇప్పటి వరకు ప్రభుత్వం ఇంకా కొత్త బడ్జెట్ ఇవ్వలేదు. బడ్జెట్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఎన్నికల అనంతరం ఏమైనా ఉత్తర్వులు ఇస్తారేమో చూడాలి. విత్తనాలు, డ్రిప్, స్ప్రింకర్ల కోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాం.
– ఉషారాణి, ఉద్యాన అధికారి, షాద్‌నగర్

బసవేశ్వరుడి స్ఫూర్తిని కొనసాగించాలి

- వీరశైవ లింగాయత్ సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్


బసవేశ్వరుడి జయంతిలో సంఘం నాయకులు

కడ్తాల్: సమ సమాజ స్థాపనకు కృషి చేసిన దార్శనికుడు బసవేశ్వరుడని వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాణం అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బసవేశ్వరస్వామి ఆలయంలో బసవేశ్వరుడి జయంతిని శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. సమాజంలో సాంఘిక దురాచారాల మీద పోరాటం చేయడమే కాకుండా వర్ణ, కుల, లింగ వివక్ష లేని సమాజం కోసం 900 ఏళ్ల క్రితమే పోరాడిన దార్శనికుడు బసవేశ్వరుడని కొనియాడారు. సమాజంలో కులాలను, మతాలను రూపు మాపేందుకు తొలి అడుగు వేసిన మొట్ట మొదటి సంఘ సంస్కర్త బసవేశ్వరుడు అన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, లింగబలిజ సంఘం సభ్యులు శివకుమార్, దినేశ్‌పాటిల్, రాజశేఖర్, విశ్వనాథ్, ఆనందప్ప, మల్లప్ప, శరణబసప్ప, సర్వేశ్వర్, మల్లేశ్, ఈశ్వరప్ప, సంతోష్, వెంకటేశ్, మల్లేశ్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తాం


ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన నాయకులు

- రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

షాబాద్: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ చైర్మన్ ఫహెంఖురేషి, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు, వ్యాపారవేత్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని పార్టీ సీనియర్ నాయకులు ముఖరంషరీఫ్, జాకీర్‌షరీఫ్ ఆధ్వర్యంలో మొయినాబాద్ తాజ్ రెస్టారెంట్ యజమాని ఎండీ ఇర్ఫాన్, బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రజాపాలనతోనే పేదల సంక్షేమం సాధ్యమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలలోనే సంక్షేమ పథకాలు అందిస్తోందని తెలిపారు. కేంద్రంలో నూ ఇండియా కూటమి గెలిస్తే ఇందిరమ్మ రా జ్యంలో మరింత సుపరిపాలన అందుతుందని చెప్పా రు. కార్యక్రమంలో నాయకులు తదితరులున్నారు.

విజయానికి సమష్టి కృషి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

హుడాకాంప్లెక్స్: బ్రాహ్మణులందరూ సామాజిక, ఆర్థిక, రాజకీయ పురోగతి కోసం కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మంత్రి శ్రీధర్‌బాబు సారథ్యంలో బ్రాహ్మణ వర్గ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టబోతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బ్రాహ్మణుల పట్ల సానుకూ లంగా ఉన్నదన్నారు. అపర చాణక్యుడు పీవీ నర్సింహారావును ప్రధాన మంత్రి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. ఈ ఎన్నికల్లో బ్రాహ్మణులంతా కాంగ్రెస్‌కు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించుకోవాలని, ముఖ్యంగా చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి


శ్రీరాంనగర్‌లో కవాతు చేస్తున్న పోలీసులు

మొయినాబాద్: ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా ఓ టు హక్కును వినియోగించుకోవాలని మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి సూచించారు. మొయినాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్ర వారం మండల పరిధిలోని శ్రీరాంనగర్, హిమాయత్‌నగర్ గ్రామాల్లో పారామిలటరీ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రజలంతా సహకరించాలన్నారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

చేవెళ్ల అసెంబ్లీ పరిధిలో పోలైన 2,177 ఓట్లు

చేవెళ్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్లలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. చేవెళ్ల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 2,353 పోస్టల్ ఓట్లు ఉండగా ఇందులో 2,177 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు చెప్పారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరు ఫెసిలిటేషన్ సెంటర్లను ఉపయోగించారు. నియోజకవర్గంలో 3,581 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకుగాను 3,459 ఓట్లు పోలైనట్లు ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. ఇతర లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి పోలైన మరో 803 ఓట్లతో కలిపితే మొత్తం 4,262 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఇక్కడ పోలైనట్లు వివరించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి


భీమేందర్‌రెడ్డికి నియామకపత్రాన్ని అందజేస్తున్న నర్సింహారెడ్డి

మొయినాబాద్ రూరల్: బీజేపీని గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జిల్లా నూతన ఉపాధ్యక్షుడిగా ఎన్కెపల్లి భీమేందర్‌రెడ్డిని నియమిస్తూ ఆయన నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని కలిసికట్టుగా పని చేసి గెలిపించాలన్నారు. ఎన్నికల ప్రచారం శనివారంతో ముగుస్తుందని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీకి ఎంతో ఆదరణ లభిస్తుందన్నారు. అదే విధంగా గ్రామాలలో నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ సభ్యులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కంజర్ల ప్రకాష్, ప్రతాప్‌రెడ్డి, పాండురంగారెడ్డి, సంగారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాత్‌రూంలో జారిపడి వ్యక్తి మృతి

మొయినాబాద్: బాత్‌రూంలో జారిపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. మొయినాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గౌండ్ల లక్ష్మయ్య(55) ఈ నెల 8న ప్రమాదవశాత్తు బాత్‌రూంలో కాలు జారి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొట్టి.. వ్యక్తి మృతి


ఘటనాస్థలిలో నాజియాబేగం

కొత్తూరు: వెనకాల నుంచి వచ్చిన లారీ ఓ బైకును ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో జాతీయ రహదారిపై పెంజర్ల కూడలి సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌కు చెందిన సయ్యద్ ఉమర్ తన చిన్నమ్మ నాజియాబేగం(28) ఆమె కూతురు మహిన్‌తో కలిసి బైకుపై మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం చుక్కంపేట గ్రామంలో ఉర్సు ఉత్సవాలకు బయలు దేరారు. మార్గమధ్యలో కొత్తూరు పెంజర్ల కూడలి వద్దకు రాగానే వారి బైకును వెనకాల నుంచి ఓ కంటెయినర్(లారీ) ఢీకొట్టింది. దీంతో బైకు కిందపడడంతో నాజియాబేగం తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిన్, ఉమర్‌లను చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా గ్రాండ్ 'మా' వేడుకలు


మనుమలు, మనుమరాళ్లకు బహుమతులు అందజేస్తున్న అన్నపూర్ణ తదితరులు

- మూడు తరాల అమ్మమ్మలు, తాతయ్యలకు సత్కారం
- భారతీయ సంస్కృతి సంప్రదాయాలు నేటి తరం అందిపుచ్చుకోవాలి
- దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ

సనత్‌నగర్: మూడు తరాల అమ్మమ్మలు..నాన్నమ్మలు ఒకే వేదికపై మెరిశారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నేటితరంతో పంచుకున్నారు. క్రమశిక్షణ, నడవడిక, భారతీయ సంస్కృతి సంప్రదాయ విలువల గొప్పతనాన్ని చాటిచెప్పారు. ఉమ్మడి కుటుంబాల్లో ఉండే మాధుర్యాన్ని ఆవిష్కరించారు. అమ్మమ్మలు, నాన్నమ్మలు చెప్పే మంచి మంచి కబుర్లు, చిట్టి చిట్టి కథలు పిల్లల్లో ధైర్య సాహసాలను, ఆత్మవిశ్వాసాన్ని ఏవిధంగా పెంపొందింపజేస్తాయో జెక్‌కాలనీ 'గ్రాండ్ మా ఉత్సవ కమిటీ' తెలియజేసింది. గ్రాండ్ మా ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రభ అనంతరెడ్డి, ఎస్.అన్నపూర్ణ, ఎల్.హైమావతి, డి.హరిత ఆధ్వర్యంలో శుక్రవారం గ్రాండ్ మా ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటిని ముందుతరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అమ్మమ్మలు, నాన్నమ్మలు నడవడిక, క్రమశిక్షణ, నైతిక విలువలకు కట్టుబాట్లపై నేటి తరానికి దిశానిర్దేశం చేయాలన్నారు. కానీ నేటితరం న్యూక్లియర్ కుటుంబాలకు అలవాటుపడిపోవడంతో అమ్మమ్మలు, నాన్నమ్మల నుంచి అందుకోవాల్సిన ఉన్నత ఆశయాలు, స్ఫూర్తిని అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఆనాటి తరం స్ఫూర్తి, ఆశయాలను నేటి తరానికి పరిచయం చేయాలన్నదే గ్రాండ్ 'మా' కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా మూడు తరాలకు చెందిన నాన్నమ్మలు, అమ్మమ్మలను ఈ వేదికపై ఘనంగా సన్మానించారు. అమ్మమ్మలు, నాన్నమ్మలతో పాటు వారి మనుమలకు పలు అంశాల్లో పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు.

కొరియర్ ద్వారా డ్రగ్స్ సరఫరా!

- ముంబై నుంచి పంపిస్తున్న ప్రధాన సప్లయర్స్
- స్కానింగ్‌లో చిక్కకుండా నల్ల కాగితంలో పార్శిల్
- ముగ్గురు పెడ్లర్స్‌ను అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: ముంబై నుంచి కొరియర్ ద్వారా నగరానికి సరఫరా అవుతున్న డ్రగ్స్ గుట్టును తూర్పు మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. సిటీతో పాటు నిజామాబాద్‌కు చెందిన ముగ్గురు పెడ్లర్స్‌ను అరెస్టు చేసి, వారి నుంచి ఎండీఎంఏ, కొకైన్ స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ ఎస్.రాష్మి పెరుమాల్ శుక్రవారం వెల్లడించారు. నిజామాబాద్‌కు చెందిన అన్నదమ్ములు అబ్బుల సాయి శరత్, అబ్బుల శ్రవణ్ ప్రస్తుతం బేగంపేటలో ఉంటున్నారు. వీరు ఐదేళ్ల క్రితం బంజారాహిల్స్‌లో లిటిల్ ఇడ్లీ పేరుతో ఓ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఇందులో సాయి కిరణ్ అనే వ్యక్తి ప్రధాన చెఫ్‌గా పని చేసేవాడు. ప్రేమలో విఫలమైన శరత్ మద్యం, డ్రగ్స్‌కు బానిసగా మారాడు. ఇతడికి తన రెస్టారెంట్‌లోనే సాయి కిరణ్ ద్వారా యూసుఫ్‌గూడకు చెందిన శ్రీవాస్తవ్ రిషబ్‌తో పరిచయమైంది. రిషబ్ కూడా డ్రగ్స్‌కు బానిసకావడంతో అతడితో కలిసి డ్రగ్స్ తీసుకోవడం ప్రారంభించారు. రిషబ్‌పై ఎస్సార్‌నగర్ ఠాణాలో ఓ డ్రగ్స్ కేసు కూడా ఉంది. ఇటీవల రిషబ్, శ్రవణ్‌లు డ్రగ్స్ సమీకరించుకుని నగరంలో విక్రయించి డబ్బు సంపాదించాలని పథకం వేశారు. వీటిని ఖరీదు చేసే బాధ్యతలు శరత్, డెలివరీ చేసుకునే బాధ్యతలు శ్రవణ్, వీటిని విక్రయించే బాధ్యతలు రిషబ్ తీసుకున్నారు. డ్రగ్ సప్లయర్స్ కోసం ఆన్‌లైన్ సహా వివిధ మార్గాల్లో అన్వేషించిన శరత్‌కు ఇటీవల ముంబైకి చెందిన వ్యక్తితో పరిచయమైంది. అతడికి ఆర్డర్ ఇవ్వడం ద్వారా ఎండీఎంఏ, కొకై న్ ఖరీదు చేశాడు. ఈ మాదకద్రవ్యాలకు సప్లయర్ కొరియర్ చేశాడు. ఎవరైనా అనుమానం వచ్చి స్కాన్ చేసినా.. పార్శిల్‌లో పత్రాలు ఉన్నాయని భావించాలనే ఉద్దేశంతో డ్రగ్స్‌ను నల్లరంగు కాగితంలో పార్శిల్ చేసి పంపాడు. బేగంపేటలో కొరియర్‌ను అందుకున్న శరత్ తన సోదరుడు శ్రవణ్‌తో కలిసి రిషబ్‌కి అందజేసేందుకు జలవిహార్ వద్దకు వెళ్లాడు. దీనిపై ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందడంతో అదనపు డీసీపీ అందె శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ఎ.నాగార్జున, ఎస్సైలు ఎం.అనంతాచారి, ఎస్.కరుణాకర్‌రెడ్డి, పి.నాగరాజు వలపన్ని ముగ్గురినీ పట్టుకున్నారు. వీరి నుంచి 11.34 గ్రాముల కొకైన్, 3.66 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను లేక్ పోలీసులకు అప్పగించిన పోలీసులు పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నారు.